క్లుప్తంగా

రెండు పుస్తకాల ఆవిష్కరణ



పుస్తకాలు ఆవిష్కరిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్, రఘురామారావు

సీతంపేట: విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సోమంచి వినయ భూషణరావు రచించిన 'కథా బృందావనం', 'చిత్ర కవితా సరం' పుస్తకాల ఆవిష్కరణ సభ జరిగింది. విశాఖ రసజ్ఞ వేదిక అధ్యక్షుడు డాక్టర్ జి.రఘురామారావు అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆచార్య కోలవెన్ను బాలమోహన్‌దాస్ ఈ పుస్తకాలను ఆవిష్కరించారు. జె.పి.శర్మ పుస్తకాలను సమీక్షించారు. కార్యక్రమంలో పలువురు రచయితలు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

మేలుకొలుపులతో ధనుర్మాసానికి స్వాగతం



మేలుకొలుపుల్లో పాల్గొన్న భక్తులు

అల్లిపురం: ధనుర్మాసానికి అల్లిపురం వాసులు మేలుకొలుపులతో స్వాగతం పలికారు. చలిని సైతం లెక్కచేయకుండా శరగడ నూకరాజు ఆధ్వర్యంలో గోవింద నామాలతో భక్తులు సంకీర్తన చేపట్టారు. వెంకటేశ్వరస్వామి పాదాల చెంత నుంచి వెంకన్న పాటోతో భజన చేస్తూ సింహాలదేవిడి, అల్లిపురం మెయిన్‌రోడ్డు, కుమ్మరవీధి, బంగారుమెట్ట, నీలమ్మవేపచెట్టు, మూడుగుళ్ల ప్రాంతం, గోవింద్‌రోడ్డు ప్రాంతాల మీదుగా వెంకటేశ్వరమెట్ట దేవాలయానికి చేరుకున్నారు. ఈ మేలుకొలుపులు సంక్రాంతి వరకు కొనసాగుతాయని భక్తులు తెలిపారు.

దంత వైద్య శిబిరానికి స్పందన



వైద్యులను సత్కరిస్తున్న కార్యవర్గ సభ్యులు

అల్లిపురం: బంగారుమెట్ట, శ్రీ రామ ఆంధ్ర యువజన సమాజం ఆధ్వర్యంలో ఆదివారం దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి స్థానికుల నుంచి విశేష స్పందన ఏర్పడింది. లయన్స్ క్లబ్, ద్వారకానగర్ బ్రాంచి నుంచి వచ్చిన వైద్యులు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మెరుగైన చికిత్స కోసం రిఫరెన్స్ చేశారు. శ్రీ రామ ఆంధ్ర యువజన సమాజం కార్యవర్గ సభ్యుడు భీశెట్టి హనుమంతురావు తదితరులు వైద్యులు, సిబ్బందిని సత్కరించారు.

అలరించిన వినోద వల్లరి



ఉప్పల అప్పలరాజును సన్మానిస్తున్న కవులు, రచయితలు

మహారాణిపేట: విశాలాంధ్ర 22వ పుస్తక మహోత్సవ ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం క్రియేటివ్ కామెడీ క్లబ్ నిర్వహించిన వినోద వల్లరి అలరించింది. విశాలాంధ్ర పుస్తక మహోత్సవ ముగింపు సందర్భంగా ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ కార్యక్రమం జరిగింది. హాస్యరత్న వేముల భాస్కరాచారి, కుమారి మల్లిక, తాళాభక్తులు లక్ష్మీప్రసాద్, సరగడ చిన్నరెడ్డి, పద్మ ప్రదర్శించిన కామెడీ స్కిట్లు, జోకులు, పేరడీ సాంగ్స్, జానపద గీతాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమ ప్రారంభానికి ముందు అరసం జిల్లా కార్యదర్శి ఉప్పల అప్పలరాజును క్రియేటివ్ కామెడీ క్లబ్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. క్లబ్ అధ్యక్షుడు మేడా మస్తాన్ రెడ్డి సారథ్యంలో జరిగిన కార్యక్రమంలో కె.వి.ఎస్.మూర్తి, వెలమల సిమ్మన్న, పరమేశ్వరరావు, పి.ఎ.రాజు తదితరులు పాల్గొన్నారు.



ప్రజారోగ్యానికి భరోసా

ప్రజారోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం భరోసా కల్పించింది. పేదలందరికీ వైద్యం అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో అన్ని వసతులతో డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల(యూపీహెచ్‌సీ)ను ఏర్పాటు చేసింది. ప్రత్యేక వైద్య నిపుణులను అందుబాటులో ఉంచింది. కేజీహెచ్ లేదా కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లకుండా ప్రజల చెంతకే ఆరోగ్య కేంద్రాలను తీసుకొచ్చి ఉచిత వైద్యం, మందులు అందజేయడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు
- అందుబాటులో అన్ని రకాల పరీక్షలు
- ప్రతి రోజూ ప్రత్యేక వైద్య నిపుణుల సేవలు
- చెంతకే వైద్య సేవలపై ప్రజల హర్షం



35వ వార్డు ప్రసాద్ గార్డెన్స్‌లోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



ల్యాబ్‌లో పరీక్షలు చేస్తున్న సిబ్బంది

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు ప్రసాద్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పేదలకు వరంలా మారింది. ఇక్కడ రోగులకు అన్ని రకాల వైద్య, రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు. అవసరమైన వారికి తగు సూచనలు, సలహాలిస్తూ ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. ఈ ఆరోగ్య కేంద్రంలో ప్రతి రోజూ సుమారు 65 మంది ఓపీ నమోదవుతోంది. సోమవారం నుంచి శనివారం వరకు ప్రతి రోజూ ఒక స్పెషలిస్ట్ వైద్య నిపుణుడు అందుబాటులో ఉంటూ రోగులకు వైద్య సేవలందిస్తున్నారు. వ్యాధులను బట్టి వైద్య పరీక్షలు చేయాలనే ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తున్నారు.

40 రకాల పరీక్షలు.. : రక్తం హిమోగ్లోబిన్ అంచనా, తెల్ల రక్త కణాల సంపూర్ణ సంఖ్య, రక్తం ప్లేట్‌లెట్ల సంఖ్య, మలేరియా పరాన్నజీవీ రక్తం స్లైడ్ పరీక్ష, ఈఎస్ఆర్ పరీక్ష, రక్తం గడ్డకట్టే సమయం, బ్లడ్ గ్రూప్ పరీక్ష, గర్భ నిర్ధారణ మూత్ర పరీక్ష, రక్తం చెక్కర పరీక్షలు, హెచ్ఐవీ, రక్తం యూరియా పరీక్ష, సీరమ్ క్రియాటినిన్ పరీక్షలు, సీరమ్ బిల్‌రూబిన్ పరీక్ష, డెంగ్యూ నిర్ధారణ వంటి సుమారు 40కి పైగా పరీక్షలు ఆరోగ్య కేంద్రాల్లో చేస్తున్నారు. వాటికి తగ్గట్టు మందులు ఉచితంగా సరఫరా చేస్తున్నారు.

స్పెషలిస్ట్ వైద్య సేవల వివరాలు

సోమవారం :	జనరల్ పరీక్షలు, స్పెషలిస్ట్‌లు
మంగళవారం :	ప్రసూతి, ఎముకలకు సంబంధించిన పరీక్షలు
బుధవారం :	చిన్నపిల్లల వైద్యుల పరీక్షలు
గురువారం :	చర్మ వ్యాధుల పరీక్షలు
శుక్రవారం :	ఈఎన్‌టీ, జనరల్ వైద్య పరీక్షలు
శనివారం :	గుండెకు సంబంధించిన పరీక్షలు, సర్జన్‌లు

రోజు వారీ ఓపీ సంఖ్య : **65**



యూపీహెచ్‌సీలో బీపీ పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి సంతోష్

వైద్య నిపుణులతో రోగులకు మేలు



ఆరోగ్య కేంద్రాల్లో ప్రత్యేక వైద్య నిపుణులు అందుబాటులో ఉండటంతో రోగులకు మేలు జరుగుతోంది. ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లకుండా వార్డులో ఉన్న ఆరోగ్య కేంద్రంలోనే వైద్యం పొందుతున్నాం. ఆరోగ్యానికి భరోసా కలిగింది.

– లింగాల అప్పలసూరమ్మ, లక్ష్మీనగర్

నెలనెలా మందులు తీసుకుంటున్నా..



ఆరోగ్య కేంద్రాల్లో వైద్య పరీక్షలు పెట్టాక, బీపీ, సుగర్‌తో ఉండే నాకు పరీక్షలు చేయించుకుని నెల నెలా మందులు తీసుకుంటున్నాను. మాలాంటి పేదవాళ్లం పెద్ద ఆస్పత్రులకు వెళ్లలేం. ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలు కొనసాగిస్తే బాగుంటుంది.

– నర్సయ్య, పండా వీధి

జనరల్ పరీక్షలు చేయించుకుంటున్నా..



పట్టణ ఆరోగ్య కేంద్రంలో సీఎం జగన్ అన్ని రకాల వైద్య పరీక్షలు పెట్టడంతో నేను ఇక్కడే పరీక్షలు చేయించుకుంటున్నాను. గతంలో కేజీహెచ్‌కు వెళ్లేవాళ్లం. ఇప్పుడు వార్డులోనే అందుబాటులో ఆస్పత్రి ఉండటం వలన శ్రమ తగ్గింది. పరీక్షలు చేసి మందులు ఉచితంగా ఇస్తున్నారు.

– భూలోకమ్మ, ప్రసాద్ గార్డెన్స్

నాణ్యమైన వైద్య సేవలు



ఆరోగ్య కేంద్రంలో నాణ్యమైన వైద్య సేవలందిస్తున్నాం. అన్ని రకాల వైద్య, రక్త పరీక్షలు జరుగుతున్నాయి. వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారందరూ వచ్చి వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి.

– సంతోష్, వైద్యాధికారి, ప్రసాద్ గార్డెన్స్ యూపీహెచ్‌సీ

ఘనంగా జాతీయ పింఛన్‌దారుల దినోత్సవం



రైల్వే పెన్షనర్లకు జ్యూట్ బ్యాగులను బహూకరిస్తున్న గల్లా భాస్కరరావు

తాటిచెట్లపాలెం: రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అఖిల భారత పింఛన్‌దారుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు వేగి నాగేశ్వరరావు అధ్యక్షతన రైల్వే న్యూకాలనీలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ వేడుకల్లో పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. వాల్తేర్ డివిజన్‌లో లోకో పైలట్‌గా పనిచేస్తూ కోవిడ్ సమయంలో మరణించిన గల్లా ఆనంద గిరివాసు జ్ఞాపకార్థం ప్లాస్టిక్ వినియోగానికి వ్యతిరేకంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా సభ్యులందరికీ జ్యూట్ బ్యాగ్‌లను అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి గల్లా భాస్కరరావు చేతుల మీదుగా బహూకరించారు. అనంతరం మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, సుగర్ వంటి పలు వైద్య పరీక్షలు ఉచితంగా చేశారు. డాక్టర్ ఎస్.ప్రవీణ్, డాక్టర్ శ్రీకాంత్ గుండె, కీళ్ల వ్యాధులపై అవగాహన, చికిత్స మార్గాలను వివరించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దొండపర్తి బ్రాంచ్ చీఫ్ మేనేజర్ బి.కె.మహాపాత్రో, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ అధికారులు జి.వి.బాలభాస్కరరావు, చంద్రమోహన్ వృద్ధాప్య దశలో ఆర్థిక భద్రత మీద పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు జీఏస్ఎం ఎంవీవీ సత్యసాయిబాబా, ఎస్.మసేను, ఎస్.బి.షా, మదీనా వలీ, కె.వై.నాయుడు, రైల్వే పెన్షనర్స్ పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ప్రధాని లక్ష్యం



వికసిత్ భారత్ సంకల్పయాత్ర పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ జీవీఎల్ నరసింహారావు

మహారాణిపేట: పేదల సంక్షేమం కోసం ప్రధాని నరేంద్ర మోదీ ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అన్నారు. ఫిషింగ్ హార్బర్ వద్ద ఆదివారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. ప్రజల అభ్యున్నతి కోసం 168కి పైగా సంక్షేమ పథకాలను మోదీ ప్రవేశపెట్టారన్నారు. లబ్ధిదారులకు ఫలాలు అందేలా అధికారులందరూ కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా స్వనిధి, ఉజ్వల, ముద్ర లబ్ధిదారులతో వారి అనుభవాన్ని పంచుకున్నారు. హామీ లేని రుణాలు పొందడం వల్ల వ్యాపారం అభివృద్ధి చెందిందని, పేద కుటుంబాల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిసాయని పేర్కొన్నారు. వికసిత్ భారత్ దృశ్యమాలికను ఎల్‌ఈడీ స్క్రీన్ మీద ఆహుతులు వీక్షించారు. ఆయుష్మాన్ భారత్ కార్డులను లబ్ధిదారులకు జీవీఎల్ పంపిణీ చేశారు. అందరి చేత ఆయన ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వికసిత్ భారత్ సంకల్పయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కందాల శివప్రసాద్, బీజేపీ నగర అధ్యక్షుడు ఎం.రవీంద్రారెడ్డి , నాయకులు రూపాయల రవికుమార్, అత్తిలి శంకరరావు, దాము యాదవ్, రామ్ కుమార్, సూరాడ రాజు, వాసుపల్లి రామారావు, జీవీఎంసీ అధికారులు పుణ్యవతి, వినయ రామప్రసాద్, అధిక సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

నగర పురవీధుల్లో గీతా శోభాయాత్ర



శోభాయాత్ర ప్రారంభిస్తున్న కృష్ణమూర్తి, విశ్వేశ్వరరావు

డాబాగార్డెన్స్: గీతా జయంతిని పురస్కరించుకుని గీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో ఆదివారం నగర పురవీధుల్లో శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. మహారాణిపేటలోని అంబికాబాగ్ సీతారామచంద్ర స్వామి ఆలయం వద్ద ప్రారంభమైన శోభాయాత్ర జగదాంబ జంక్షన్, టర్నర్ చౌల్ట్రీ, పూర్ణామార్కెట్, టౌన్‌కొత్తరోడ్డు, రీడింగ్ రూమ్, కురుపాం మార్కెట్ మీదుగా పాతనగరం రాజప్పనాయుడు వీధిలోని గీతాభవన్ వరకు సాగింది. యాత్ర పొడవునా ప్రచార సమితి మహిళా సభ్యులు, భక్తులు సామూహికంగా భగవద్గీత శ్లోకాల పారాయణం, శ్రీవిష్ణు సహస్రనామాలు పఠించారు. గోవింద నామ సంకీర్తన చేశారు. గీతా ఉపదేశం చేస్తున్నట్టు శ్రీకృష్ణార్జునల వేషధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సమితి గౌరవ అధ్యక్షుడు వై.కృష్ణమూర్తి, అధ్యక్షుడు సీహెచ్ విశ్వేశ్వరరావు జెండా ఊపి శోభాయాత్ర ప్రారంభించారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు పి.జగన్‌మోహన్‌రావు, కార్యదర్శి ఎం.వనజాదేవి, ఆధ్యాత్మిక వేత్త ఎంవీ రాజశేఖర్, కోశాధికారి జీవీఆర్ ప్రసాద్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక.. ఆనంద వేడుక



ఏవీఎన్ కళాశాల పూర్వ విద్యార్థుల సందడి

డాబాగార్డెన్స్: ఏవీఎన్ కళాశాల పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. విశాఖతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు, వివిధ రాష్ట్రాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు నగరంలోని ఓ రిసార్ట్స్‌లో కలుసుకుని ముచ్చటించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా.. సందడిగా గడిపారు.

వానప్రస్థ వృద్ధాశ్రమానికి వితరణ



నిత్యావసర సరకులు అందిస్తున్న మణికంఠ సేవా సంఘం సభ్యులు

మురళీనగర్: పట్టాభిరెడ్డి తోటలోని వానప్రస్థ వృద్ధాశ్రమంలో మురళీనగర్ శ్రీ మణికంఠ సేవా సంఘం సభ్యులు ఆదివారం సేవా కార్యక్రమం నిర్వహించారు. విజయ్ భాస్కరరావు తన తండ్రి గోపాలకృష్ణన్ నాయర్ జ్ఞాపకార్థం అందించిన ఆర్థిక సాయంతో ఆశ్రమంలోని వృద్ధుల కోసం రూ.10,000 విలువ చేసే నిత్యావసర సరకులను అందించారు. కార్యక్రమంలో విజయ్ భాస్కరరావు, శ్రీజ, సూర్య, గీతా నాయర్, ప్రొఫెషనల్ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఎం.గిరిగోపాల్, మణికంఠ సేవా సంఘం కార్యదర్శి హెచ్.నాగేంద్ర, కోశాధికారి జి.వి.ఆనందరావు, ఎస్.వి.ఎల్.ఎన్.నరసింహం, జి.వి.మధుసూదనరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశికి పటిష్ట ఏర్పాట్లు



భాస్కరరెడ్డికి ఏర్పాట్లను వివరిస్తున్న దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు, ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: ఈనెల 23న ముక్కోటి ఏకాదశి సందర్భంగా సింహగిరిపై జరుగుతున్న ఏర్పాట్లను ఆదివారం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తితో కలిసి భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డి పరిశీలించారు. ఆరోజు ప్రముఖుల తాకిడి ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుందని.. అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేయాలని సూచించారు. చందనోత్సవంలో ప్రముఖులకు సరైన ఏర్పాట్లు చేయలేదన్న అపవాదు రావడంతో ఈసారి ముక్కోటి ఏకాదశికి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రముఖుల దర్శనాల క్యూ ప్రత్యేకంగా ఏర్పాటు చేసి సాధారణ భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్టు ఈవో శ్రీనివాసమూర్తి తెలిపారు. వీఐపీలు దర్శనానికి వచ్చినప్పుడు దేవస్థానం, రెవెన్యూ అధికారుల మధ్య లైజనింగ్ ఉండేలా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చినగదిలి తహసీల్దార్ రమణయ్య, దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు, ఏఈవో పాలూరి నరసింగరాజు పాల్గొన్నారు.

బాలోత్సవం విజయవంతం

డాబాగార్డెన్స్: నగరంలోని సెయింట్ ఆంథోనీ తెలుగు మీడియం ఎలిమెంటరీ స్కూల్‌లో మూడు రోజులుగా నిర్వహించిన విశాఖ బాలోత్సవం ఆదివారంతో విజయవంతంగా ముగిసింది. 2 నెలలుగా బాలోత్సవ రిసెప్షన్ కమిటీ చేసిన కృషి, పాఠశాలలు, తలిదండ్రులు అందించిన సహకారంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు విశాఖ జిల్లా బాలోత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి జీఎస్ రాజేశ్వరరావు పేర్కొన్నారు. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పాఠశాల తరగతి గదులు, ఆవరణను 3 రోజుల పాటు ఇచ్చి ఇంత పెద్ద కార్యక్రమం జరగడానికి కారణమైన ఆర్‌సీఎం స్కూల్స్ జనరల్ మేనేజర్ రెవరండ్ ఫాదర్ రత్నకుమార్, స్కూల్ ఇన్‌చార్జ్ జయరాజులకు కృతజ్ఞతలు తెలిపారు. బాలోత్సవంలో విశాఖ నగరానికి చెందిన 130 పాఠశాలల నుంచి సుమారు 6 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. వైవిధ్య భరితమైన అంశాలతో ఉల్లాసంగా, ఉత్సాహంగా బాలోత్సవం నిర్వహణకు అనేక సంస్థలు, శ్రేయోభిలాషులు సహకారం అందించారన్నారు. సీఎంఆర్, ఎస్ఆర్‌కే ఇన్‌ఫ్రా, లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్, ఇన్నర్ వీల్ క్లబ్, ఆసరా చారిటబుల్ సొసైటీ, కన్సర్న్, జేసీఐ, శుభోదయ కెమికల్స్, ఎస్సార్, కృష్ణా మెటర్నిటీ హాస్పిటల్, ఎంవీఆర్ డయాబెటిస్, ధాన్ ఫౌండేషన్, ద్వారకామయి సంస్థ, ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలు, చైతన్య కాలేజీ యాజమాన్యం, సాయిబాబా ఆలయ కమిటీ, అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంతో పాటు అనేక మంది వస్తు రూపేణా, భారీ విరాళాల రూపంలో సహాయం అందించారని పేర్కొన్నారు. వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతిఘటనతోనే హక్కుల సాధన

డాబాగార్డెన్స్: ప్రతిఘటనతోనే దళిత హక్కులు సాధించుకోగలమని దళిత ప్రజాసంఘాల నేతలు స్పష్టం చేశారు. దళిత విముక్తి 25 ఏళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకొని ఆదివారం ప్రతిఘటన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ముందుగా ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్, పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాబాగార్డెన్స్ ప్రేమసమాజం హాలులో నిర్వహించిన కార్యక్రమంలో పూర్వ ఐఏఎస్ అధికారి డాక్టర్ పీజే సుధాకర్ మాట్లాడుతూ భారతదేశంలో కులమే అన్ని సమస్యలకు మూలంగా ఉందన్నారు. అందుకే రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కులవ్యవస్థను ధ్వంసం చేయాలని పిలుపునిచ్చారన్నారు. దేశ ప్రజలకు రాజ్యాంగం ద్వారా మానవ హక్కుల రక్షణ కల్పించిన మహనీయుడు అంబేడ్కరని కొనియాడారు. రాజ్యాంగ హక్కులన్నీ పోరాటాలతోనే కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. సీనియర్ పాత్రికేయుడు వీవీ రమణమూర్తి మాట్లాడుతూ దళితులను బానిసలుగా చూస్తున్నారన్నారు. దళిత విముక్తి రాష్ట్ర కన్వీనర్ సుర్ల వెంకటరమణ, పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మీ, భారత నాస్తిక సమాజం అధ్యక్షుడు జీడీ సారయ్య, మానవ హక్కుల వేదిక నాయకులు వీఎస్ కృష్ణ, ప్రొఫెసర్ సూరప్పడు, బంకపల్లి అప్పారావు, బి.సన్యాసమ్మ, కె.కుమార్, యు.శివ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అసభ్య పదజాలంతో దూషించారని ఫిర్యాదు

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళను ఇంటి యజమాని, ఎదురుగా ఉన్న వారు కలిసి అసభ్యకరమైన పదజాలంతో దూషించడంపై పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. గవర కంచరపాలెంలో ఎ.సుజాత అనే మహిళ ఆమె కుమార్తెతో కలిసి అద్దె ఇంట్లో నివసిస్తోంది. ఆమె ఎదురు ఇంట్లో నివసిస్తున్న కె.భవాని, ఆమె కుటుంబ సభ్యులు సుజాతపై అందరితో లేనిపోని మాటలు చెబుతున్నారు. ఎందుకలా చెబుతున్నారని సుజాత ప్రశ్నించడంతో ఆమెను అసభ్య పదజాలంతో తిట్టడం వంటివి చేశారు. భవాని ఇంటి యజమాని కూడా ఆమెను తిట్టడం, సామగ్రి ఇంట్లో నుంచి బయటకు పడేయడంతో శనివారం రాత్రి వీరందరిపై సుజాత పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.సాయి కేసు దర్యాప్తు చేపట్టారు.

అయ్యో.. పాపం

- వృద్ధుడిని వదిలించుకున్న కన్న పిల్లలు
- ఆదుకున్న జీవీఎంసీ ఏయూటీడీ సిబ్బంది



వృద్ధుడిని ప్రశ్నిస్తున్న ఏయూటీడీ సిబ్బంది

అల్లిపురం: వయసులో ఉన్నప్పుడు సంపాదించాడు. పిల్లలను పెంచి, పెద్ద చేశాడు. వారికి పెళ్లిళ్లు కూడా చేశాడు. ప్రస్తుతం ఆయన వయసు మళ్లింది. వయోభారంతో నడవలేని పరిస్థితిలో ఉన్నాడు. దీంతో పిల్లలు వదిలించుకోవాలనుకున్నారు. రెండు రోజుల కిందట రాత్రి సమయంలో ఆ వృద్ధుడిని తీసుకువచ్చి జగదాంబ జంక్షన్‌లో సీఎంఆర్ జ్యువెలరీ వద్ద వదిలిపెట్టి వెళ్లిపోయారు. రెండు రోజులుగా చలిలో కదల్లేని స్థితిలో పడి ఉన్న ఆ వృద్ధుడి విషయాన్ని తెలుసుకున్న భీమ్‌నగర్ ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహం మేనేజర్ జ్యోతిర్మయి, తన సిబ్బందితో వెళ్లి తీసుకువచ్చి ఆశ్రయం కల్పించారు. అతనికి సపర్యలు చేసిన అనంతరం వివరాలు అడిగి తెలుసుకున్నారు. తనది విజయనగరం గంట స్తంభం ప్రాంతమని ఆ వృద్ధుడు తెలియజేశారు